క్లుప్తంగా

ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



విజయపురిసౌత్: స్థానిక ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో శుక్రవారం విజయపురిసౌత్‌లోని జెన్‌కో క్వార్టర్స్ వద్ద ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో 70 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జెన్‌కో ఈఈ అప్పాజీ మాట్లాడుతూ విజయవాడకు చెందిన భవ్య హెల్త్ సర్వీసెస్ సహకారంతో ఏపీ జెన్‌కో ఉద్యోగులు, స్థానికులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ రేవంత్, డీఈ రాజారెడ్డి, ఏఈ రేవతి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇక అంతా ఆన్‌లైన్



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా పట్టణంలోని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ఖాతాలు నిర్వహిస్తున్న మెప్మా ప్రాజెక్టు రాష్ట్ర అధికారులు ప్రతి డ్వాక్రా సంఘాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మూడు రోజులుగా స్థానిక మెప్మా ప్రాజెక్టు ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్, సీఓ అంజలిల ఆధ్వర్యంలో పట్టణానికి సంబంధించి 700కు పైగా ఉన్న డ్వాక్రా సంఘాల లావాదేవీలకు సంబంధించి ప్రతి ఆర్‌పీచే ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ప్రతిరోజూ ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులను కార్యాలయాలకు పిలిపించటం, సమావేశాలు ఏర్పాటు చేయటంతో పాటు వారికి అవగాహన కల్పించి అన్ని లావాదేవీలను ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించటానికి చర్యలు చేపట్టారు. ఈ నెలాఖరులోగా మొత్తం గ్రూపులను ఆన్‌లైన్ చేసి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా గ్రూపుల నిర్వహణ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

వీధి వ్యాపారులకు అవగాహన



మాచర్ల : పట్టణంలోని ప్రతి ప్రాంతంలో వీధి వ్యాపారాలు చేసేవారికి ప్రధానమంత్రి ఈఎంఎస్ పథకం కింద స్వనిధి స్వాభిమాన్ అనే పథకంపై నవంబర్ 18 నుంచి డిసెంబర్ 2 వరకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని స్థానిక మెప్మా ప్రాజెక్టు కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రాజెక్టు మేనేజర్ రాజశేఖర్, సీఓ అంజలి, అంగన్‌వాడీ కార్యకర్త శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న రుణాలను మంజూరు చేయటం, సామాజిక, ఆర్థిక ప్రొఫైల్‌ను తయారు చేయటం, సామాజిక భద్రత పథకంలో వీధి వ్యాపారులు, వారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయటం, వీధి వ్యాపారుల ద్వారా డిజిటల్ చేయించటం అవగాహన కల్పించటంపై కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులుగా వీధి వ్యాపారులు, వివిధ వర్గాలు, ఆర్‌పీలతో అవగాహన సమావేశం జరిపారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఈ సదర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ... గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించటం జరిగిందన్నారు. విశాఖపట్నంలో మహిళ న్యాయవాది హత్య, న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడి సరైనది కాదన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు పి.నవ్య, లోకేశ్వరి, కోటేశ్వరరావు, న్యాయవాదులు అయాజ్, అహమ్మద్, వెలిశల రామకృష్ణ, రమేష్, మంద జాకబ్, ఎం.వెంకటేశ్వర్లు, ఈసా తదితరులున్నారు.

ఐదు ట్రాక్టర్లు స్వాధీనం

మాచర్ల: నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం నుంచి మాచర్లకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టణ పోలీసులు గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకొని ట్రాక్టర్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకర్‌రావు తెలిపారు. వివిధప్రాంతాల నుంచి అక్రమంగా ట్రాక్టర్‌ద్వారా మట్టిని తరలించి విక్రయిస్తున్న వారిని తహసీల్దార్ ముందు తగు చర్యలు నిమిత్తం హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

- పర్యాటక ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు కరువు
- ప్రధాన రహదారుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

విజయపురిసౌత్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా విజయపురిసౌత్ పరిస్థితి తయారయింది. ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను సందర్శించేందుకు నిత్యం దేశ విదేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు విజయపురిసౌత్‌కు వస్తుంటారు. పర్యాటకులు విజయపురిసౌత్‌లో మురికి కూపాలుగా ఉన్న ప్రాంతాలను చూసి ఇదేం పర్యాటక ప్రదేశం అంటూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీ, పైలాన్, విజయపురిసౌత్ కాలనీలలో డ్యాం నిర్మాణం నుంచి పారిశుద్ధ్యం పనులు డ్యాం అధికారుల పర్యవేక్షణలో జరిగేవి. అయితే గత పదేళ్ల క్రితం విజయపురిసౌత్‌లో పారిశుద్ధ్య పనులు నిలిపివేశారు. సాగర్ డ్యాం తెలంగాణ అధికారుల అజమాయిషీలో ఉండటంతో 2014వ సంవత్సరంలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల విభజన తరువాత పారిశుద్ధ్య పనులు ఆంధ్ర ప్రాంతమైన విజయపురిసౌత్‌లో నిలిపివేయాలని అప్పటి సాగర్ ప్రాజెక్టు ఎస్‌ఈ విజయభాస్కర్ ఆదేశాలు జారి చేసి, ఇక్కడ పని చేసే ఆరోగ్య సిబ్బందిని తెలంగాణ ప్రాంతంలో ఉన్న హిల్‌కాలనీకి బదిలీ చేయటంతో అర్ధంతరంగా పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. దీంతో కాలనీలోని మెయిన్ బజార్‌తో సహా ఫిల్టర్ హౌస్, అంబేడ్కర్ సెంటర్, డౌన్ మార్కెట్, సాగర్ మాత దేవాలయం సమీపంలో ఉన్న ప్రాంతాలతో పాటు, పలు వీధులలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయి మురికి కూపాల్లా తయారయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు పార్కులలో ఖాళీ ప్రదేశాలలో తమతో పాటు తెచ్చుకున్న ఆహార పదార్థాలు తిని అక్కడే చెత్త వేస్తున్నారు. ఆ చెత్తను తొలగించే వారు లేకపోవటంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకునిపోతుంది. వర్షాకాలంలో చెత్తపై దోమలు చేరటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గతంలో విజయపురిసౌత్‌ను సందర్శించిన ప్రజా ప్రతినిధులకు పలుమార్లు గ్రామస్తులు పారిశుద్ధ్య పనులు చేసేందుకు ఆరోగ్య శాఖ సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వినతి పత్రాలను అందజేశారు. అయినా ఇప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



సాగర్‌మాత దేవాలయం వద్ద చెత్త



డౌన్ మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న వ్యర్థాలు



ఫిల్టర్ హౌస్ ఏరియాలో పేరుకొని ఉన్న చెత్త



అంబేడ్కర్ సెంటర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న వ్యర్థాలు

చింతలతండా సర్పంచ్‌గా లచ్చునాయక్



విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతలతండా గ్రామ సర్పంచ్‌గా శుక్రవారం కేతావత్ లచ్చునాయక్ ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా చేసిన కేతావత్ శ్రీనునాయక్ వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేయటంతో ఉప సర్పంచ్‌గా ఉన్న లచ్చునాయక్ సర్పంచ్ పదవి చేపట్టారు. అనంతరం లచ్చునాయక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ముందుకు నడిపిస్తానని అలాగే గ్రామస్తుల సహాయ సహకారాలను మరవబోనని అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, టీడీపీ సీనియర్ నాయకులు స్వామినాయక్, రాజ్ కుమార్‌లు లచ్చునాయక్‌కి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామావత్ స్వామినాయక్, రామావత్ రాజ్ కుమార్, కేతావత్ బాబూరావు, హనుమనాయక్, హేమంత్, చంద్రనాయక్, మత్యనాయక్, హనుమ పూజారి, థావునాయక్, రామవత్ భగవాన్‌నాయక్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



మాచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ అనేక దశాబ్దాల నుంచి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేస్తూ రాష్ట్రంలో ప్రథమ ఉపాధ్యాయ సంఘంగా ఆదరణ పొందుతుందని జిల్లా యూటీఎఫ్ ఆడిట్ మెంబర్ షేక్ జమాల్, జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ మహాసభలు జరిపి మాచర్ల మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అతిథులైన జమాల్, శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలన్నీ చెల్లించాలన్నారు. పనివేళల పెంపు ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలని, 12వ పీఆర్‌సీ, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. యూటీఎఫ్ అధ్యక్షులుగా షేక్ నసీర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా వి.బాలాజీనాయక్, ఎం.పద్మజ, గౌరవాధ్యక్షులుగా ఎం.దాసు, కోశాధికారిగా వి.లింగం, మహిళా కార్యదర్శిగా ఎల్ చిన్న కుమారిలను ఎంపిక చేశారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

మినీ గోకులాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ఏపీడీ కొరటా మల్లికార్జునరావు

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని పశువుల సంరక్షణ కోసం మంజూరు చేసిన మినీ గోకులాల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీ కొరటా మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఆయన ఏపీఓ జయచంద్ర కుమార్‌తో కలిసి రెంటచింతలలో నిర్మిస్తున్న 6 గోకులాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం 25 గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. 4 గేదెలు ఉన్నవారికి రూ.1.80 లక్షలు, 6 గేదెలు ఉన్నవారికి రూ.2.30 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 18 గోకులాల పనులను మాత్రమే ప్రారంభించారని మిగిలిన 7 గోకులాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ నెల 25 తేదీ నాటికి ప్రారంభించని గోకులాలను రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామాలలో ఉపాధి హామీ పనులను 30వ తేదీలోపు గుర్తించి ఎంపీడీఓ సరోజినిదేవికి నివేదికను అందజేయాలని అన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ మల్లికార్జునరావు, ఏపీఓ జయచంద్రకుమార్

ఫ్లెక్సీల రగడ



తొలగించిన రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఫ్లెక్సీ



ఐలాండ్ సెంటర్‌లో కమ్మ వారి కార్తిక వన సమారాధన ఫ్లెక్సీ

పోలీసులు, మున్సిపల్ అధికారుల ఓవర్ యాక్షన్

పిడుగురాళ్ల: కార్తిక మాసం పురస్కరించుకొని వన సమారాధన కార్యక్రమానికి పిడుగురాళ్ల పట్టణంలో ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ లైఫ్ హాస్పిటల్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల ఫొటోలతో 24వ తేదీన కొండమోడులో వన సమారాధన జరుగుతుందని ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఇదే 24వ తేదీన పిడుగురాళ్ల కమ్మ సామాజిక వర్గ కార్తిక వన సమారాధన ఫ్లెక్సీని ఐలాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని ఫొటోలతో, అలాగే కాపు వన సమారాధన ఆహ్వానమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మెగాస్టార్ చిరంజీవి, వంగవీటి మోహన్‌రంగా ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఫ్లెక్సీని శుక్రవారం ఉదయం తొలగించారు. దీంతో పట్టణంలో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ ఫ్లెక్సీ ఎవరికి అడ్డం లేదని చెప్పినా తొలగించారు. అయితే రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సాయంత్రానికి మరలా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌ను సాక్షి వివరణ కోరగా ఉదయం ఫ్లెక్సీని కొన్ని అనివార్య కారణాల వలన తొలగించాల్సి వచ్చిందని, మరలా సాయంత్రం ఏర్పాటు చేసుకోమని చెప్పటం జరిగిందని తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు



పాలువాయి(రెంటచింతల): ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాలువాయి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రాంతాల వారీగా మెనూలో మార్పులు చేస్తున్నందున ఏజెన్సీలు భోజనాన్ని రుచిగా తయారు చేసేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమై గ్రామంలో వ్యాధుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి గ్రామస్తులకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సరోజినిదేవి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వెన్ను వెంకటేష్, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు ఉన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

మాచర్ల: నియోజకవర్గంలోని మాచర్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ సివిల్ కోర్టులో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి కేసుల పరిష్కారానికి రాజీ చేయనున్నట్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ శుక్రవారం తెలిపారు. జడ్జి ప్రకటన విడుదల చేస్తూ రాజీ పడదగ్గ కేసులన్నిటినీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు డిసెంబర్ 14వ తేదీన పరిష్కరించటానికి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, భరణం, బ్యాంకు రుణాలు, లిటిగేషన్‌తో పాటు రాజీ పడదగ్గ కేసులన్నీ పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



బండ్ల మహేష్

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ప్రమాదవశాత్తూ జరిగిన ఈ ఘటనలో దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంకు చెందిన బండ్ల క్రాంతి, మార్తమ్మ దంపతుల కుమారుడు మహేష్(19) మృత్యువాతపడ్డాడు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై మహేష్ దాచేపల్లికి వస్తున్నాడు. నాగులేరు బ్రిడ్జి వద్ద తెలంగాణకి చెందిన బస్సుని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. రోడ్డు డివైడర్‌కి తల బలంగా గుద్దుకోవటంతో తీవ్ర రక్తస్రావం అయ్యి మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహేష్ గురజాలలోని కళాశాలలో బీఫార్మసీ చదివేందుకు చేరాల్సి ఉంది. చదువుకోవాల్సిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వసతి గృహాల పరిశీలన





ఎస్టీ బాలుర గురుకులంలో వసతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పుల్లారావు

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: 'వసతులు కరువైన సంక్షేమ హాస్టళ్లు' శీర్షికన సాక్షిలో శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు కారెంపూడి ఇన్‌చార్జి తహసీల్దార్ కె.పుల్లారావు శుక్రవారం కారెంపూడిలోని బీసీ వసతి గృహం, ఎస్టీ బాలుర గురుకులం, ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో వసతులను పరిశీలించారు. బీసీ హాస్టల్ విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న వసతిని కూడా ఖాళీ చేయాలని యజమాని కోరుతున్నారని 42 ఏళ్లుగా అద్దె ఇళ్లలో కొనసాగుతున్న బాధను తీర్చాలని కోరారు.

- అలాగే గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సౌకర్యాలను తహసీల్దార్ పరిశీలించారు. క్లాస్ రూంలనే రాత్రి వసతిగా వాడుకుంటున్న తీరును గమనించారు. నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయించుకుని అందులోకి పాఠశాలను మార్చాలని హెచ్చరించారు. ఒక నెలలో నూతన పాఠశాల భవనం పూర్తి అవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.
- ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడ ప్రిన్సిపాల్‌కు సూచించగా సిబ్బంది లేరనే సమాధానం చెప్పారు. అన్ని హాస్టళ్లలో టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలని తహసీల్దార్ సూచించారు.

'డయల్ యువర్ డీఎం'కు అనూహ్య స్పందన



డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో డీఎం వీరాస్వామి, అధికారులు

మాచర్ల: పట్టణంలోని మాచర్ల బస్టాండ్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీయం కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. మొత్తం 38 మందిలో 33 మంది మాచర్ల నుంచి కర్నూలుకు పునరుద్ధరణ చేయాలని ప్రయాణికులు ఫోన్ చేశారన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 మధ్యలో నడికుడి రైల్వే స్టేషన్ నుంచి మాచర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని, అదే విధంగా శనివారం మాచర్ల రైల్వే స్టేషన్ నుంచి విజయపురిసౌత్‌కు అదనంగా 2వ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. రెంటచింతల మండలంలోని తుమ్మకోట నుంచి గురజాల, పిడుగురాళ్లకు ఉదయం 5.30కి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మాచర్ల నుంచి మల్లపాలెం మీదుగా పుల్లలచెరువుకు బస్సు కల్పించాలన్నారు. శ్రీశైలం రోడ్డులో విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం వద్ద రిక్వెస్ట్ స్టాప్‌ను, మాచర్ల పట్టణంలోని గుంటూరు రోడ్డు చెన్నకేశవ కాలనీ వద్ద రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని ఫోన్ చేసినట్లు వీరాస్వామి తెలిపారు. ఈ సమస్యలన్నీ ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

మూడు నెలల పింఛన్ పొందవచ్చు

మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు



మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్ పొందే వారికి వెసులుబాటు కల్పించి రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా, మూడవ నెల పెండింగ్ బకాయిలతో సహా పింఛన్ పొందవచ్చునని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేయటం జరిగిందని, దీనిని పింఛన్‌దారులు సద్వినియోగం చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలల పాటు పింఛన్ తీసుకోకపోయినా, మూడవ నెల పింఛన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. మూడు నెలలూ తీసుకోకపోతే వెంటనే రద్దవుతుందన్నారు. ఆ తరువాత మళ్లీ దరఖాస్తు చేసుకుంటేనే పునరుద్ధరిస్తామన్నారు. పింఛన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే మరుసటి నెల అతని భార్యకు వితంతు పింఛన్ మంజూరవుతుందన్నారు. పింఛన్‌దారులు దీనిని దృష్టిలో పెట్టుకొని సకాలంలో పింఛన్ తీసుకునేలా ప్రయత్నించాలన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరం

ఏడీఈ ఎం.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏడీఈ శ్రీనివాసరావు

రెంటచింతల: విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని గురజాల ఏడీఈ ఎం.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ బకాయిలు వినియోగదారులు చెల్లించాలని అప్పుడే నాణ్యమైన విద్యుత్ అందజేయడానికి అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని 11 గ్రామాలలో ఇళ్ల సర్వీసు కనెక్షన్‌లకు సంబంధించి మొత్తం బకాయిలు రూ.90 లక్షలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.10.50 లక్షలు వరకు ఉన్నాయని తెలిపారు. ఏపి ట్రాన్స్‌కో నియమ నిబంధనలు పాటించకుండా విద్యుత్ వినియోగించడం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో మొత్తం ఏజీఎల్ (వ్యవసాయ) కనెక్షన్‌లు 3,350 ఉన్నాయని రైతులు ప్రతి నెల సర్వీస్ చార్జి కింద రూ.30 చెల్లించాలని, రైతుల బకాయిలు రూ.15 లక్షలు వరకు ఉన్నాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. వినియోగదారులు తమ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఏఈ షేక్ మస్తాన్‌వలి, ఎల్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.